క్లుప్తంగా

చురుగ్గా పూడిక తీత పనులు



పూడికతీత పనులు చేస్తున్న కూలీలు

గొలుగొండ: స్థానిక పంచాయతీ శివారు శ్రీరాంపురం, కొత్తజోగుంపేట, 80 కాలనీ, ఎస్సీ కాలనీలో పూడికతీతతోపాటు దోమల నివారణకు మందుల పిచికారీ చురుగ్గా సాగుతోంది. సర్పంచ్ కోసిపల్లి బుజ్జి, కార్యదర్శి రమణ, వైద్య సిబ్బంది పర్యవేక్షణలో గురువారం ఈ పనులు నిర్వహించారు. దోమల వ్యాప్తి వల్ల వ్యాధులు పెరుగుతున్నాయని, వెంటనే కాలువల్లో పూడికతీత పనులు చేస్తున్నట్లు పంచాయతీ అధికారులు తెలిపారు.

బీమా చెక్కు అందజేత



మహిళకు చెక్కును అందజేస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

దేవరాపల్లి: స్థానిక సహకార సొసైటీ సభ్య రైతు కాళ్ల సత్యం ఏడాది క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించగా, అతడికి ప్రమాద బీమా రూ.లక్ష మంజూరైంది. నామినీగా ఉన్న సంజీవమెట్టకు చెందిన అతని భార్య దేముడమ్మకు ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు గురువారం రైవాడ అతిథి గృహంలో అందజేశారు. బాధిత మహిళకు గతంలో రూ.30 వేలు, తాజాగా రూ.లక్ష చెక్కు అందజేసినట్టు స్థానిక సొసైటీ అధ్యక్షుడు దాసరి గోపి తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది చలుమూరి బాపునాయుడు, మహలక్ష్మీనాయుడు పాల్గొన్నారు.

అజోల్లాతో బహుళ ప్రయోజనాలు



అజోల్లాపై అవగాహన కల్పిస్తున్న మాస్టర్ ట్రైనర్ బత్తి దేవి

రోలుగుంట: పంటలో అజోల్లా వినియోగంతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయని ప్రకృతి వ్యవసాయశాఖ మాస్టర్ ట్రైనర్ బత్తి దేవి అన్నారు. కొంతలం రెక్కి చెరువులోకి సిబ్బందితో వెళ్లి అజోలా సేకరించారు. దీని వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. అజోల్లా వినియోగంతో వరిలో కలుపు నివారించుకోవచ్చన్నారు. నత్రజని స్థిరీకరణ ఉంటుందని తెలిపారు. పంట అభివృద్ధి, దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయని ఆమె వివరించారు. కార్యక్రమంలో ఆ శాఖ సిబ్బంది సాంబమూర్తి, మోదినాయుడు, సుజాత, నాగకాంతం, సాయిలక్ష్మి, భవాని, రాంబాబు పాల్గొన్నారు.

నూకాంబిక సన్నిధిలో జీవీఎంసీ సీసీపీ

అనకాపల్లిటౌన్: గవరపాలెం శ్రీ నూకాంబిక అమ్మవారిని జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్(సీసీపీ)వి.సునీత గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు దాడి జయవీర్ అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందించారు. కార్యక్రమంలో 80వ వార్డు కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కర్, పట్టణ టౌన్‌ప్లానింగ్ అధికారి జనార్దన్‌రావు, జీవీఎంసీ జోన్ సర్వేయర్ కె.అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడికి జైలు శిక్ష

అనకాపల్లిటౌన్: మండలంలోని పిసినికాడ గ్రామంలో 2019లో జరిగిన చోరీ కేసుల్లో ముద్దాయికి 42 రోజులు జైలు శిక్ష విధిస్తూ 13వ ఏఎంఎం న్యాయమూర్తి ఎం.శివకుమార్ గురువారం తీర్పునిచ్చినట్లు రూరల్ ఎస్‌ఐ సీహెచ్ నరసింగరావు తెలిపారు. ఎస్‌ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. 2019లో పిసినికాడ గ్రామంలో నిందితుడు పి.నవీన్ చోరీకి పాల్పడి పోలీసులకు చిక్కాడు. కేసు నమోదు చేసి న్యాయస్థానానికి అప్పగించారు. వాదోపవాదాలు అనంతరం నవీన్‌ను దోషిగా నిర్ధారిస్తూ న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారని ఎస్‌ఐ పేర్కొన్నారు.

ముమ్మరంగా వరినాట్లు

- తాండవ ఆయకట్టులో చురుగ్గా ఖరీఫ్ పనులు
- ఆర్బీకేల్లో ఎరువులు సిద్ధం
- ఒకే సారి దమ్ము, వరినాట్లు
- పెరిగిన కూలీ రేట్లు



పొలంలో దమ్ము చేస్తున్న ట్రాక్టరు



వరినారు తీస్తున్న వ్యవసాయదారులు



తాండవ కాలువలో నిండుగా ప్రవహిస్తున్న నీరు



ఉత్సాహంగా వరినాట్లు వేస్తున్న కూలీలు

నాతవరం: జిల్లాలోనే ఏకైక మేజరు ప్రాజెక్టు తాండవ రిజర్వాయరు ఆయకట్టులో ఖరీఫ్ వరినాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటికే ఖరీఫ్ సాగుకు కావలసిన విత్తనాలు, పెట్టుబడి సాయం రైతు భరోసా నగదు ప్రభుత్వం ముందుగానే అందించిన విషయం తెలిసిందే. దీనికితోడు ప్రాజెక్టులో పుష్కలంగా సాగునీరు ఉండటంతో రైతులు హుషారుగా పనులు చేస్తున్నారు. దాంతో కూలీలకు, దమ్ము చేసే ట్రాక్టర్లకు డిమాండ్ ఏర్పడింది.

తాండవ ప్రాజెక్టు నీరు ఆధారంగా రెండు జిల్లాల పరిధిలో 52 వేల ఎకరాల్లో వరినాట్లు వేస్తారు. అనకాపల్లి జిల్లాలో నాతవరం కోటవురట్ల, నర్సీపట్నం, పాయకరావుపేట మండలాల పరిధిలో 32 వేల ఎకరాలకు, కాకినాడ జిల్లా పరిధిలో కోటనందూరు, తుని, రవతలపూడి, శంఖవరం మండలాల పరిధిలో 19,850 ఎకరాలకు తాండవ నీరు ప్రవహిస్తోంది. ప్రజాప్రతినిధులు, రైతుల అభీష్టం మేరకే తాండవ నీరు ఈ నెల 10న ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ విడుదల చేశారు. తాండవ ప్రధాన రెండు కాలువల ద్వారా నీరు నిండుగా ప్రవహిస్తోంది. శివారు ఆయకట్టుకు సైతం నీరు సకాలంలో సరఫరా చేసేందుకు ప్రాజెక్టు అధికారులు కాలువలపై నిత్యం పర్యవేక్షిస్తున్నారు. వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు కావలసిన ఎరువులు సరఫరా చేస్తున్నారు. ఖరీఫ్ సాగులో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించేందుకు మోతాదు మించి ఎరువులు వాడకుండా వ్యవసాయాధికారులు రైతులకు సలహాలు, సూచనలు చేస్తున్నారు.

కూలీలకు డిమాండ్

తాండవ ప్రాజెక్టు కింద ఆయకట్టులో రైతులంతా ఒకే సారి వరినాట్లు వేయడంతో దమ్ము చేసే ట్రాక్టర్లకు, కూలీలకు విపరీతమైన డిమాండ్ పెరిగింది. వేలాది ఎకరాల్లో దమ్ము చేయడానికి సరిపడా ట్రాక్టర్లు వరినాట్లు వేసే కూలీల సంఖ్యలో లేకపోవడంతో రేట్లు పెంచేశారు. దీంతో వ్యవసాయ రైతులకు పెట్టుబడి మరింత పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి



వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేక వర్షాలు కురవక తాండవ ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో నీరు రావడం లేదు. ప్రస్తుతం తాండవలో 370.0 అడుగుల నీరు ఉంది. రోజు ఒక్కంటికి రెండు కాలువల ద్వారా 500 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నాం. ఈ నీరు అక్టోబరు వరకు ప్రవహిస్తుంది. ఈ మధ్యలో ఏమాత్రం వర్షం పడిన ప్రాజెక్టులోకి నీరు చేరితే ఖరీఫ్ సీజన్‌లో వరి పంట పండేంత వరకు నీరు సరఫరా చేయగలం. రైతులు నీటిని పొదుపుగా వాడకుంగా వృథా చేస్తే వరి పంట పొట్ట దశలో నీటి సమస్య వస్తుందని ముందుగా రైతులకు సూచిస్తున్నాం. మా సిబ్బంది కాలువలపై నిత్యం పర్యవేక్షణ చేస్తున్నారు. వారికి సహకరించాలి.

– జి.స్వామినాయుడు, డీఈ, తాండవ ప్రాజెక్టు

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



ఎమ్మెల్యే గణేష్ సమక్షంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఉద్యోగులు

వేతనాల పెంపుపై ఐకేపీ ఉద్యోగుల హర్షం

నర్సీపట్నం: ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి వేతనాలు పెంపుదల చేయటం పట్ల ఐకేపీ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఐకేపీ ఉద్యోగులు గురువారం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌ను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఎమ్మెల్యే సమక్షంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఎం ఎస్.పార్వతీబాయి, కె.చినబాబు, గొలుగొండ, నర్సీపట్నం, నాతవరం, మాకవరపాలెం మండలాల సీసీలు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం/రోలుగుంట/మాడుగుల/చోడవరం/చీడికాడ: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పిలుపునిచ్చారు. ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోషల్ ఫారెస్టు సౌజన్యంతో పాత్రికేయులు నర్సీపట్నం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. రోలుగుంట ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పోతల లక్ష్మీరమణమ్మ, కన్నడ నటుడు, రాష్ట్ర వైఎస్సార్ సీపీ యువజన ప్రతినిధి గొందు సిద్ధూ మొక్కలు నాటారు. మాడుగుల సెయింట్ ఆన్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజనాలు పెట్టారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, మున్సిపల్ ఆర్డీడీ నాగరాజు, కమిషనర్ కనకారావు, సోషల్ ఫారెస్టు జిల్లా అధికారి జి.లక్ష్మణ్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి పెరుమళ్ల వెంకటరావు, ప్రెస్ క్లబ సభ్యులు జి.త్రినాథరావు, రొబ్బా శ్రీను, సురేష్ శాంతో యూనియన్ నాయకులు పాల్గొన్నారు. చోడవరం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో స్వయంభూ విఘ్నేశ్వరస్వామి, షిర్డీ సాయిబాబా ఆలయాల ప్రాంగణంలో పేదలకు అన్నదానం నిర్వహించారు. తన కార్యాలయం ఆవరణలో తహసీల్దార్ తిరుమలరావు మొక్కలు నాటారు. ఎస్‌ఐ అప్పలనాయుడు, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు డీవీఎం నాయుడు పాల్గొన్నారు. చీడికాడ మండలం జేబీపురంలో చెత్త నుంచి సంపద కేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి సిరికి రామారావు పాల్గొన్నారు.

సహకార సంఘాల సమస్యలపై ఉద్యోగుల వినతి



డిప్యూటీ సీఎం బూడికి వినతి పత్రాన్ని అందజేస్తున్న సహకార సంఘాల ఉద్యోగులు

దేవరాపల్లి: తమ న్యాయ పరమైన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని మాడుగుల నియోజకవర్గం పరిధిలోని సహకార సంఘాల ఉద్యోగులు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడును కోరారు. గురువారం తారువ క్యాంప్ కార్యాలయంలో డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడును కలిసి వారు వినతి పత్రాన్ని అందజేశారు. జీవో నంబర్ 36, 90లను సంబంధిత అధికారులు అమలు చేయలేదని, దీర్ఘకాలిక సమస్యలైన హెచ్‌ఆర్ పాలసీ, 2019 వేతన సవరణలను అమలు కావాల్సి ఉందని వివరించారు. ప్రభుత్వానికి ఆర్థిక భారంలేని తమ సమస్యలను పరిష్కరించేలా కృషి చేయాలని కోరారు. వీటిపై డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఏపీ రాష్ట్ర వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ స్టేట్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఆర్. వెంకటరావు, జిల్లా కన్వీనర్ కన్వీనర్ లక్ష్మణరావు, యూనియన్ సభ్యుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇంటింటి కుళాయి పనులు ప్రారంభం

మాడుగుల రూరల్: జల జీవన్ మిషన్‌లో భాగంగా రూ.3.30 కోట్లతో కేజేపురంలో ఇంటింటి కుళాయి కనెక్షన్ల ఏర్పాటు పనులు ప్రారంభమయ్యాయి. గురువారం సర్పంచ్ జామి రమణబాబు కొబ్బరి కాయ కొట్టి పనులు ప్రారంభించారు. దీంతో గ్రామానికి తాగునీటి సమస్యలు తీరుతాయని గ్రామస్తులు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఉప సర్పంచ్ కాళ్ల కోటమ్మ, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కాళ్ల రాము, మళ్ల బాబు తదితరులు పాల్గొన్నారు.

కొరువాడలో నా భూమి- నా దేశం

కె.కోటపాడు: భావితరాలకు స్వచ్ఛమైన గాలి, నీరు, సారవంతమైన నేలను అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని అనకాపల్లి జిల్లా సోషల్ ఫారెస్ట్ రేంజ్ అధికారి చంద్రశేఖర్ అన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా గురువారం కొరువాడలో నా భూమి- నా దేశం కార్యక్రమం శిలాఫలకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఎంపీటీసీ చీపురపల్లి అచ్చిబాబు, సర్పంచ్ సింగంపల్లి నారాయణమూర్తిలతో కలిసి మొక్కలను నాటారు. కార్యక్రమంలో వన సేవకుడు చిరికి గోవింద, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆదిరెడ్డి వెంకటరావు పాల్గొన్నారు.

గుమ్మాళ్లపాడులో పశువులకు వైద్య పరీక్షలు



పశు వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ సన్యాసినాయుడు

రావికమతం: గుమ్మాళ్లపాడులో గురువారం నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరం విజయవంతమైంది. పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని సర్పంచ్ బంటు సన్యాసినాయుడు ప్రారంభించారు. తట్టబంద పశువైద్యాధికారి నూకేశ్వరరావు 119 పశువులను పరీక్షించి పాడిరైతులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ముఖ్యంగా వ్యాధి నివారణ టీకాలు, నట్టల నివారణ, గొడ్డుమోతు తదితర వాటికి మందులు అందించారు. వర్షాకాల సీజన్‌లో పశువులకు వచ్చే చర్మ, గొంతువాపు వ్యాధి నివారణకు టీకాలు వేస్తున్నామన్నారు. ఎంపీటీసీ బంటు విజయలక్ష్మి శ్రీను, గోపాల మిత్ర అయోధ్య పాల్గొన్నారు.

నేటి నుంచి సంతోషిమాతకు శ్రావణ పూజలు



ప్రత్యేక అలంకరణలో సంతోషిమాత అమ్మవారు

మాడుగుల రూరల్: అమ్మలగన్న అమ్మగా భాసిల్లుతున్న కె.జె.పురం జంక్షన్‌లోని సంతోషిమాత ఆలయంలో శ్రావణమాసం ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కాళ్ల అమ్మతల్లినాయుడు గురువారం తెలిపారు. ఈ నెల 18న తొలి శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహిస్తామన్నారు. దాతల సహకారంతో అన్నసమారాధన ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఏటా మాదిరిగా అమ్మవారి మాలాధారణ ఈ నెల 25న ప్రారంభం కానుందన్నారు. తొమ్మిది రోజులపాటు భక్తులు నియమ నిష్టలతో పూజలు చేసి, అనంతరం ఆలయం వద్ద ఇరుముడులు సమర్పిస్తారన్నారు.

యాజమాన్య పద్ధతులు తెలుసుకోవాలి



రైతులుకు వివరిస్తున్న ఏవో వాసుదేవరావు తదితరులు

మాడుగుల: ఖరీఫ్ వరి సాగులో ఎరువులు, క్రిమి సంహారక మందులు, యాజమాన్య పద్ధతులు తెలుసుకుని పాటిస్తే అధిక దిగుబడులు వస్తాయని ఏవో ఎం. వాసుదేవరావు తెలిపారు. కింతలి వల్లాపురంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ముందుగా ఖరీఫ్ వరి యాజమాన్య పద్ధతులు గురించి రైతులకు ఆయన వివరించారు. అనంతరం చేతులకు గ్లౌజులు వేసుకుని ముఖానికి మాస్క్ వేసుకుని ఉదయం 10 గంటలలోపు, మధ్యాహ్నం 3 గంటల తర్వాత చేలు తడిచేలా క్రిమి సంహారక మందులు పిచికారీ చేసుకోవడం వల్ల మంచి ఫలితాలు వస్తాయన్నారు. వివిధ దశల్లో వాడే పురుగులు మందులు గురించి వివరించారు. విత్తన మొలకశాతం 85 శాతానికి ఎక్కువ ఉంటే నారుమడులులో వేసుకోవాలన్నారు. విత్తన శుద్ధి వివరాలు తెలియజేశారు. ఆర్బీకే సిబ్బంది, వై.కల్యాణి, ఎం.సతీష్, వైఎస్సార్‌సీపీ నాయకులు తాళ్లపురెడ్డి రాంబాబు పాల్గొన్నారు.

సకాలంలో పూర్తి చేస్తేనే ప్రభుత్వానికి పేరు

అధికారులతో సమీక్షలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి



పనుల పురోగతిపై అధికారులతో చర్చిస్తున్న ఎంపీపీ లక్ష్మణమూర్తి, ఎంపీడీవో హనుమంతరావు

నాతవరం: నూతన భవన నిర్మాణాలు సకాలంలో పూర్తి చేస్తేనే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి తెలిపారు. గురువారం తన కార్యాలయంలో ఆయన అధికారులతో సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం బిల్లులు సకాలంలో చెల్లిస్తున్నా కొంతమంది కాంట్రాక్టర్లు పనులు చేయకుండా జాప్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో సగానికిపైగా సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ క్లినిక్ భవనాల పనులు పూర్తి కాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంతవరకు చేసిన పనులకు బిల్లులు చెల్లింపులు చేశామన్నారు. అధికారులు ప్రత్యేక దృష్టి సారించి యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు, అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన భవనాలు నిర్మాణాలు గడప గడపకు నిధులతో వేగవంతం చేయాలన్నారు. మండల వ్యాప్తంగా పనులు నిర్లక్ష్యం చేయడంపై ఎమ్మెల్యే గణేష్‌కు పలుమార్లు అసంతృప్తి వ్యక్తం చేశారన్నారు. ఎంపీడీవో హనుమంతరావు మాట్లాడుతూ భవన నిర్మాణాలపై కలెక్టరు చాలా సీరియస్‌గా ఉన్నారన్నారు. సచివాలయాల వారీగా క్షేత్రస్థాయి పరిశీలన చేసి పనులు వేగవంతం చేసేలా చర్యలు చేపడతామన్నారు. ఈ విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు సహకరించాలన్నారు జల్‌జీవన్ మిషన్ పనులు, జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. పంచాయతీ రాజ్ శాఖ జేఈ వెంకటేశ్వరమ్మ, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ పోలువర్తి పార్థసారథి, ఉపాధి ఏపీవో చిన్నారావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, గన్నవరం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి గొర్లె వరహాలబాబు, పి.కె.గూడెం ఎంపీటీసీ గాడి దేవిరమేష్, వివిధ శాఖలు అధికారులు పాల్గొన్నారు.

స్కేటింగ్ విజేతలకు అభినందన



జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీల్లో పతకాలు పొందిన విద్యార్థులతో స్కూల్ సిబ్బంది

కొత్తకోట: అంతర్ యూనిక్ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీల్లో స్థానిక సెయింట్ జాన్స్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరచి ద్వితీయ స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ రూపనంది గురువారం తెలిపారు. అనకాపల్లిలో ఇటీవల జరిగిన ఈ పోటీల్లో పాల్గొన్న తమ స్కూల్ నుంచి 24 మంది విద్యార్థులు పతకాలు గెలుచుకున్నట్లు పేర్కొన్నారు. ఐదుగురు బంగారు, 11 మంది వెండి, 8 మంది కాంస్య పతకాలను పొందినట్లు తెలిపారు. విజేతలను ఆమెతోపాటు అకడమిక్ ఇన్‌చార్జి చంద్రమౌళి, ఉపాధ్యాయులు అభినందించారు.

వ్యవసాయ కూలీలకు డిమాండ్

మెట్ట ప్రాంతాల్లో వరినాట్లు ఎండుముఖం



వీరనారాయణంలో వరినాట్లు వేస్తున్న దృశ్యం



కె. వల్లాపురంలో వరినాట్లు వేయడానికి సిద్ధం చేసిన పొలం

మాడుగుల రూరల్: మండలంలో ఖరీఫ్ వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. గత నెలలో కురిసిన వర్షాలతో ఒకే సారి వరినాట్లు వేయడం రైతులు ప్రారంభించారు. దీనికి తోడు వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. మండలంలో పెద్దేరు, తాచేరు, ఉరకగెడ్డ, పాలగెడ్డ, రిజర్వాయర్ల ఆయకట్టు పరిధి గ్రామాలతోపాటు చీడికాడ మండలం కోనాం జలాశయం ఆయకట్టు పరిధి కె.జె.పురం, వంటర్లపాలెం, ముకుందపురం గ్రామాల్లో వరినాట్లు వేస్తున్నారు. అన్ని గ్రామాల్లో ఒకే సారి వరినాట్లు వేస్తుండటంతో కూలీలకు అమాంతంగా డిమాండ్ పెరిగింది. మహిళా కూలీలకు రోజుకు ఉదయం నుంచి సాయంత్రం వరకు రూ.600 నుంచి రూ.800, మగ కూలీలకు రూ.700 వరకు, దమ్ము దున్నే ట్రాక్టర్లకు గంటకు రూ.1000, పవర్ టిల్లర్లకు రూ.500 వరకు పెరిగింది. పెద్దేరు జలాశయం పరిధి రాచకట్టు, ఆర్ఎంసీ ఆయకట్టు పరిధిలో ఒకే సారి వరినాట్లు వెయ్యడం ప్రారంభించారు. ప్రస్తుతం వాతావరణం పొడిగా ఉండటం వల్ల వరినాట్లు వేగంగా వేస్తున్నారు. మండలంలో 10,500 ఎకరాల్లో వరినాట్లు వెయడానికి లక్ష్యంగా పెట్టుకున్నారు. 30 శాతం మేర వరినాట్లు పూర్తయినట్లు ఏవో వాసుదేవరావు తెలిపారు. మరోవైపు వారం రోజులుగా వేసవిని తలపించే విధంగా ఎండలు కాయడంతో మెట్ట భూముల్లో వరినాట్లు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

650 హెక్టార్లలో వరినాట్లు

మాకవరపాలెం: మండలంలో 650 హెక్టార్లలో వరినాట్లు పూర్తయ్యాయని ఏవో చిరంజీవి గురువారం తెలిపారు. మండలంలో సాధారణ విస్తీర్ణం 1,250 హెక్టార్లు కాగా, పల్లపు ప్రాంతాల్లో 650 హెక్టార్లలో వరినాట్లు వేశారన్నారు. వర్షాలు లేకపోవడంతో మెట్ట ప్రాంతాల్లో ఆలస్యం అయిందన్నారు. ఈ నెలాఖరులోపు వర్షాలు కురిస్తే నాట్లు పూర్తవుతాయన్నారు.

21న మెయిన్ రోడ్డు విస్తరణ పనులు పునః ప్రారంభం

- వ్యాపారుల అభ్యర్థన మేరకు 90 అడుగులకు కుదింపు
- భవన యజమానుల సమావేశంలో ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: పట్టణ మెయిన్ రోడ్డు విస్తరణ పనులు ఈ నెల 21న పునః ప్రారంభిస్తామని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో రోడ్డు విస్తరణకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన భవన యజమానులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో మెయిన్ రోడ్డును 120 అడుగులకు విస్తరించాలని నిర్ణయం తీసుకున్నారన్నారు. భవన యజమానులకు తీవ్ర నష్టం వాటిల్లుతుండటంతో తాము వంద అడుగులకు నిర్ణయం తీసుకున్నామన్నారు. తాను స్వయంగా భవన యజమానులను కలిసినప్పుడు వచ్చిన అభ్యంతరాలను దృష్టిలో పెట్టుకుని 90 అడుగులకు కుదించామన్నారు. 105 మంది భవన యజమానులు విస్తరణకు అంగీకరించడం సంతోషంగా ఉందన్నారు. అందరికీ డాక్యుమెంటేషన్ ప్రక్రియ పూర్తికాగానే 15 రోజుల్లో టీడీఆర్ బాండ్లు ఇస్తామన్నారు. నాలుగు రెట్లు విలువైన టీడీఆర్ బాండ్లు, భూసేకరణ ద్వారా ఇచ్చే నష్ట పరిహారానికి వ్యత్యాసాన్ని ఎమ్మెల్యే వివరించారు. కోర్టుకు వెళ్లిన భవన యజమానులకు సంబంధించి వందడుగులకు భూసేకరణ చేసి నష్ట పరిహారం చెల్లిస్తామన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ కనకారావు డిజిటల్ స్క్రీన్‌పై రోడ్డు విస్తరణ, డ్రైనేజీ వ్యవస్థ, డివైండర్ ఏర్పాటుపై అవగాహన కల్పించి యజమానుల సందేహాలను నివృత్తి చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, మాజీ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, టౌన్‌ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

శ్రావణ మాసంలో హరికథా గానం



హరికథను ఆలపిస్తున్న భారతి

అనకాపల్లిటౌన్: శ్రావణమాసం నెలరోజులూ గవరపాలెం గౌరీ పంచాయతన ఆలయంలో హరికథా గానం నిర్వహించనున్నట్లు దేవాలయం అధ్యక్షుడు బొడ్డేడ సన్యాసినాయుడు తెలిపారు. గురువారం ఆలయ ఆవరణలో ఏలూరు పంచమవేదం మహాభారతం హరికథ జ్ఞానయజ్ఞము కళాకారిణి ఎస్.భారతి ఆధ్వర్యంలో హరికథా గానం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది శ్రావణ మాసోత్సవంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రోజూ సాయంత్రం 6 నుంచి రాత్రి 8.30 వరకు హరికథా గానం ఉంటుందన్నారు. తబలతో కె.ప్రసాద్, హార్మోనియంతో కె.నాగేశ్వరరావులు సహకరిస్తారని వెల్లడించారు. కార్యక్రమంలో దేవాలయ కార్యదర్శి బుద్ధ రమణాజీ, కోశాధికారి కర్రి శివసూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.